సాక్షి చిత్తూరు

మంగళవారం । 18 । జూన్ । 2024



ఇంజినీర్లుగా రాణిద్దాం రండి

ఇంజినీరింగ్ అడ్మిషన్లకు విశ్వవిద్యాలయాలు సిద్ధమవుతున్నాయి. ఈ నెల చివరి వారంలో దీనికి పూనుకోనున్నాయి. - 8లో



ముక్కంటి ఆలయం కిటకిట

వారాంతపు, వరుస సెలవుల నేపథ్యంలో ముక్కంటి ఆలయం భక్తులతో కిక్కిరిసింది. - 8లో



కర్ణాటక మద్యం ధ్వంసం

వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న కర్ణాటక మద్యాన్ని పోలీసులు ధ్వంసం చేశారు. - 8లో

న్యూస్‌రీల్

నిత్యావసర సరకుల గోడౌన్ తనిఖీ



గోడౌన్‌లో తూకాలను పరిశీలిస్తున్న జేసీ శ్రీనివాసులు

బంగారుపాళెం: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలోని నిత్యావసర సరకుల సరఫరా గోడౌన్(ఎంఎల్‌ఎస్ పాయింట్)ను సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు తనిఖీ చేశారు. గోడౌన్‌కు వచ్చిన సరకుల వివరాలు గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సరకుల నాణ్యత, తూకాలు పరిశీలించారు. డీలర్లకు సకాలంలో సరకులు సరఫరా చేసి లబ్ధిదారులకు అందించేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. స్టాక్ పాయింట్‌కు వచ్చే సరకుల్లో తూకాలు సక్రమంగా వస్తున్నాయా, లేదా? అనేది ఎప్పటికప్పుడు సరి చూసుకోవాలని, సరకులు నాణ్యత కూడా చూడాలన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

చిత్తూరు కార్పొరేషన్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని క్యాంపు కమాండెంట్ కల్నల్ నోయిల్ వివేక్ మోనిస్ అన్నారు. స్థానిక జిల్లా ట్రైనింగ్ సెంటర్‌లో ఎన్‌సీసీ క్యాడెట్లకు శిక్షణ శిబిరం నిర్వహిస్తుండడం విదితమే. సోమవారం ఎన్‌సీసీ క్యాడెట్లతో అటవీ ప్రాంగణంలో దాదాపు 500 మంది మొక్కలు నాటినట్లు ఆయన చెప్పారు. గ్లోబల్ వార్మింగ్ మూలాన భూతాపం పెరిగిపోతోందని, అందువల్ల పర్యావరణ పరిరక్షణకు అందరూ పాటుపడాలన్నారు. ఆ దిశగా విరివిగా మొక్కలు నాటి సరంక్షించాలని కోరారు. మానవాళి మనుగడ పర్యావరణ పరిరక్షణ పైనే ఆధారపడి ఉందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ మేజర్ లోకనాథన్, ఎన్‌సీసీ అధికారులు ప్రసాద్‌రెడ్డి, రమేష్, మొగిలినాయుడు తదితరులు పాల్గొన్నారు.


శ్రీవారి సన్నిధిలో చిన్నజీయర్‌స్వామి



పెంచలకోనలో చిన్నజీయర్‌స్వామి

రాపూరు: పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహస్వామిని సోమవారం త్రిదండి శ్రీమన్నారాయణ చిన్నజీయర్‌స్వామి దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థాన అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, స్వామి,అమ్మవార్ల ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం స్వామీజీకి తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో డీసీ సాగర్‌బాబు, దేవస్థాన ప్రధానార్చకులు సీతారామయ్యస్వామి పాల్గొన్నారు.

● నేత్రపర్వం..తెప్పోత్సవం





తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి తెప్పోత్సవాలు సోమవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల పాటు జరిగే ఈ తెప్పోత్సవాల్లో మొదటి రోజు అమ్మవారు రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీకృష్ణుని అలంకరణలో పుష్కరిణిలో విహరిస్తూ భక్తులను కటాక్షించారు.

- చంద్రగిరి



ఈద్ ముబారక్: ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు చెప్పుకుంటున్న చిన్నారులు



ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

భక్తిప్రపత్తులతో బక్రీద్

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరులో సోమవారం బక్రీద్ పండుగను ఘనంగా ముస్లింలు జరుపుకున్నారు. ఉదయం నుంచే మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. మత పెద్దలు ధార్మికోపన్యాసం చేశారు. ముస్లింలతో మసీదులు, ఈద్గా మైదానాలు కళకళలాడాయి. గిరింపేటలో ఈద్గా మైదానానికి పెద్ద సంఖ్యలో ముస్లింలు ర్యాలీగా వచ్చి ప్రార్థనలు చేశారు. ప్రొఫెసర్ అన్వర్ తన ధార్మికోపన్యాసంతో ముస్లింలకు మార్గదర్శనం చేశారు. అల్లా ప్రబోధించిన మార్గంలో అందరూ నడవాలని అన్నారు. దాన, సేవా గుణాలతో ముందుకుపోవాలని హిత వచనాలు పలికారు. అనంతరం వయోభేదం లేకుండా అందరూ ఆలింగనాలు చేసుకుంటూ బక్రీద్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. జిల్లాలోని పలమనేరు, పుంగనూరు, కుప్పం, పూతలపట్టు, నగరి, పుత్తూరు, గంగాధరనెల్లూరు తదితర ప్రాంతాల్లోని మసీదులు, ఈద్గా మైదానాలకు ముస్లింలు పోటెత్తారు. అనంతరం ఖుర్బానీ పేరిట పేదలకు విరివిగా దానధర్మాలు చేశారు. మధ్యాహ్నం కులమతాలకు అతీతంగా సహపంక్తి భోజనం చేసి మత సామరస్యాన్ని చాటారు.



ఉమ్మడి జిల్లాలో వ్యవసాయరంగం తర్వాత పాడి రంగంపై ఆధారపడి రైతులు ఎక్కువగా జీవిస్తున్నారు. అప్పుడప్పుడూ కరువు పరిస్థితులు వ్యవసాయ రంగాన్ని కుదేలు చేసినా అధైర్య పడక పశుపోషణతోనే రైతన్నలు తమ బతుకు బండిని లాగించారు. ఇక్కడ మట్టిని, పశువులనే నమ్ముకున్న రైతన్నలకు వాటితో విడదీయరాని అనుబంధమూ ఉంది.



జెర్సీ షాహీవాల్ (జెర్సీ క్రాస్) రకం ఆవులు

పాడి రైతులకు కామధేనువు

- 'ఎర్ర ఆవులు'..వ్యవహారంలో జెర్సీ షాహివాల్, జెర్సీ క్రాస్‌లుగా పేరు
- మూడు దశాబ్దాల సంతతి పరీక్షలతోనే ఇప్పటి ఎర్ర ఆవులు
- వ్యాధి నిరోధక శక్తి, పాలలో వెన్నశాతం ఎక్కువ
- పాలు రుచికరం, అధిక ధర
- ఎక్కువ ఉష్ణోగ్రతను తట్టుకునే శరీర తత్వం
- సన్న, చిన్నకారు రైతులకు ఆదాయ మార్గం
- చిత్తూరు జిల్లాలో 11 లక్షల వరకూ ఈ రకం పాడి ఆవులు

పలమనేరు: పశువుల విషయానికి వస్తే ఇక్కడ ఎర్ర ఆవులని పిలుచుకునే పాడి పశువులు దేశంలోనే ఎక్కువగా ఉమ్మడి చిత్తూరు జిలాల్లోని ఉన్నాయి. ఇక్కడి వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా తక్కువ మేతతో, ఎక్కువ పాల ఉత్పత్తి చేస్తూ, అధిక రోగనిరోధక శక్తి కలిగిన సంకరజాతి పశువులు ఇవి. మూడు దశాబ్దాలుగా పశు పరిశోధన శాస్త్రవేత్తలు పడిన కష్టానికి ఈ అరుదైన మేలి రకం పశువులు జిల్లాకు దక్కి రైతులకు వరంలా మారాయి. ప్రధానంగా సన్న, చిన్నకారు రైతులకు కామధేనువులా అవతరించాయి. ఈ రకం పశువులకు మన జిల్లా పెట్టింది పేరు. సాధారణంగా ఇక్కడ హెచ్‌ఎఫ్(నలుపు, తెలుపు మిక్స్) పాడి ఆవులు, జెర్సీక్రాస్‌లో ఎక్కువగా ఉన్నాయి. హెచ్ ఎఫ్ కంటే జెర్సీ క్రాస్ వాటికే ఇక్కడి రైతులు ఆసక్తి చూపుతున్నారు.

అంతరించిపోతున్న అరుదైన పశు జాతులు

దేశంలో 34 రకాల పశు జాతులున్నాయి. వీటిల్లో అత్యంత ముఖ్యమైంది పుంగనూరు పొట్టి రకం పశువులే. ఇవి పలమనేరు పశు పరిశోధనా కేంద్రంలో 300 వరకూ ఉన్నాయి. కేరళ రాష్ట్రంలోని కొట్టాయం జిల్లాలో వేచూరు రకం పొట్టి ఆవులు, అధిక పాలనిచ్చే షాహీవాల్ రకం కూడా కనుమరుగవుతోంది. ఇలాంటి అంతరించిపోతున్న జాతులను నెల్లూరు జిల్లాలోని కావలి సమీపంలోని చింతలదీవి నేషనల్ బ్రీడింగ్ సెంటర్‌లో సంరక్షిస్తున్నారు. వీటిని మరింత అభివృద్ధి చేసేందుకు ఇక్కడి కేంద్రంలో పిండమార్పిడి కేంద్రాన్ని (ఎంబ్రో ట్రాన్స్‌ఫర్ ల్యాబ్) ప్రభుత్వం నెలకొల్పింది.

ఎర్ర ఆవుల చరిత్ర ఏమిటంటే...

ఇంగ్లాండ్‌లోని జెర్సీ అనే ద్వీపంలో అధిక పాల ఉత్పత్తినిచ్చే జెర్సీ అనే రకాన్ని నార్త్ ఇండియాలోని షాహివాల్ రకాల కలయికే ఈ జెర్సీ షాహీవాల్. 50శాతం జెర్సీ రక్తం, 50శాతం షాహీవాల్ రక్తంతో ఉంటాయి. వీటిని తిరుపతి ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ, పలమనేరు పశుపరిశోధన కేంద్రాలు కలసి 1988 నుంచి 2022 దాకా సంతతి పరీక్షల ద్వారా అభివృద్ధి చేస్తూ వచ్చాయి. ఎక్కువ పాలిచ్చే తల్లికి పుట్టిన మగదూడను విత్తనంలా వాడుకుని జన్యుపరంగా వాటిని అభివృద్ధిని చేస్తున్నారు. ఇలా ఆరేళ్లకోసారి ఓ తరం నుంచి మరో తరానికి సంతతి చేస్తూ పాల ఉత్పత్తిన పెంచే ఎర్ర ఆవులను సృష్టించారు. మొదట్లో పూటకు 6లీటర్లు, ఆపై 10 లీటర్లు..ప్రస్తుతం 15 లీటర్ల వరకూ పాలు ఇచ్చేలా వీటిని ఉత్పత్తి చేశారు.



దూడ

వీటి ప్రత్యేకత తెలుసుకుందాం

ప్రస్తుతం జిల్లాలో ఉన్న సంకరజాతి పాడి ఆవులు(హెచ్‌ఎఫ్-హోల్‌స్టీయన్ ఫ్రీజిన్, హాలెండ్) ఇక్కడి వేడికి తట్టుకోలేవు. కర్ణాటక రాష్ట్రంలోని కోలారు జిల్లా, మదనపల్లె డివిజన్‌లో మినహా తూర్పు మండలాల్లో వీటి పోషణ కుదరదు. పాల ఉత్పత్తి బాగున్నా రోగాల బెడద ఎక్కువతో రైతుకు నష్టాలొస్తున్నాయి. అయితే ఎర్ర ఆవులు క్రాస్ బ్రీడ్ కావడంతో ఇక్కడి ఉష్ణోగ్రతకు తట్టుకుంటాయి. తక్కువ మేతతోనే ఎక్కువ పాలను ఇస్తాయి. ముఖ్యంగా పైలేరియా సీస్, గాలికుంటు లాంటి రోగాలను తట్టుకుంటాయి. ఈతకు ఈతకు మధ్య అంతరం తగ్గి త్వరగా ఎదకొస్తాయి. దీంతో ఇక్కడి రైతులకు ఎంతగానో ఉపయోగపడుతాయి.

మరింత ఉత్పత్తి చేయాలి



ఇప్పటి వరకు అధిక పాల దిగుబడి కోసం రైతులు సంకరజాతి పశువులను రైతులు పెంచారు. అయితే రైతు వెచ్చించే ఖర్చుతో వాటి నుంచి వచ్చే ఆదాయం మించడంతో తిరిగి దేశవాళీ పశువుల వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. చిన్న రైతులకు ఎంతో ఉపయోగమైన జెర్సీ షాహీవాల్ పశువులదే ఇక భవిష్యత్తు. వీటిని మరింత ఉత్పత్తి చేయాల్సిన అవసరం ఉంది. **- ఏకాంబరం, డీన్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇన్సుఎన్స్‌నల్ పామ్ కాంప్లెక్స్, వెటర్నరీ కాలేజ్ ఆఫ్ సైన్సెస్, హైదరాబాద్**

ఎర్ర ఆవులకు రోగాలను తట్టుకునే శక్తి



స్వదేశీ, విదేశీ రక్తంతో సంకర జాతిగా ఉత్పత్తి అయిన జెర్సీ షాహీవాల్(జెర్సీ క్రాస్) జిల్లాలోని రైతులకు ఎంతో అనుకూలం. ఇవి రోగాలను తట్టుకుంటాయి. పాలలో వెన్నశాతం ఎక్కువ కాబట్టి ధర ఎక్కువగా ఉంటుంది. ఇవి దేశంలోనే ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎక్కువగా ఉన్నాయి. అధిక ఉష్ణోగ్రతలను సైతం తట్టుకుంటాయి. మేత కూడా తక్కువగానే మేస్తాయి. పాడి రైతులు ఇప్పుడు వీటినే ఎక్కువగా పెంచుతున్నారు. **- ప్రొఫెసర్ వేణు, ఎస్వీ వెటర్నటీ యూనివర్సిటీ, తిరుపతి**

టమాట రైతుల్లో చిగురిస్తున్న ఆశలు

- పుంజుకుంటున్న టమాట ధరలు
- ప్రస్తుతం బాక్సు ధర రూ.1000
- బయటి రాష్ట్రాల్లో తగ్గిన సరుకు
- ప్రస్తుతం పిందె దశలోని తోటలకు ధర పెరిగే అవకాశం



పలమనేరు మార్కెట్‌లో అమ్మకానికి తెచ్చిన టమాటాలు

పలమనేరు: ధరలుంటే రైతుల వద్ద సరుకుండదు. సరుకున్నప్పుడు ధరలుండవు. ఇది కొన్నేళ్లుగా పలమనేరు ప్రాంతంలో టమాట రైతుల పరిస్థితి. ఈనెల మొదటివారంలో 14కిలోల బాక్సు ధర రూ.340 నుంచి 450 దాకా ఉండగా, రెండ్రోజుల నుంచి ధర పెరుగుతూ సోమవారం నాటికి బాక్సు ధర రూ.1000కి చేరింది. ప్రస్తుతం బయటి రాష్ట్రాల నుంచి వ్యాపారులు పలమనేరు మార్కెట్‌కు టమాట కొనుగోళ్లకు వస్తున్నారు. దీనికి తోడు ఇప్పుడు కోత కోస్తున్న స్థానిక సరుకు తగ్గుతోంది. ఇప్పటికే కోతలు ముగిసిన తోటలు వడిగిపోతున్నాయి. ప్రస్తుతం కోతదశలో ఉన్న తోటలకు డిమాండ్ వచ్చే అవకాశం ఉందని వ్యాపారులు భావిస్తున్నారు.

పంటకు పంటకు మధ్య గ్యాప్‌లో ధరల పెరుగుదల

పలమనేరు నియోజకవర్గంలో ఈ సీజన్‌లో సాధారణ సాగు 7వేల హెక్టార్లు. ప్రస్తుతం 3వేల హెక్టార్లలో కోతలు పూర్తయ్యాయి. మిగిలిన 4వేల హెక్టార్లలో 20శాతం కోత దశలో, 40 శాతం పిందె దశలో, 40 శాతంపూత ద‌లో ఉంది. పూత, పిందె దశలోని తోటలు కాపుకు రావాలంటే మరో 20 రోజులు పడుతుంది. మే నెలలో నాటిన తోటలు ఈనెలాఖరుకల్లా వడిగిపోతాయి. ఈ ప్రాంతంలో ప్రతి మూడు నెలలకోసారి టమాట సాగు చేస్తుంటారు. ప్రస్తుతం రెండో కాపు ఈ నెలాఖరు నాటికి మార్కెట్‌కు వస్తుంది. ఇదే సమయంలో పొరుగు రాష్ట్రమైన తమిళనాడుతోపాటు అనంతపురం ప్రాంతాల్లో టమాట దిగుబడి తగ్గింది. ముఖ్యంగా ఒడీశా, మహారాష్ట్రలో టమాటాకు భారీ డిమాండ్ వచ్చింది. ఫలితంగా ధరలు క్రమంగా పెరుగుతున్నట్లు వ్యాపారులు చెప్పారు. ఇక మూడో సీజన్ తోటలు జూలై మొదటి వారం నుంచి మార్కెట్‌కు రానున్నాయి. అప్పటికీ ధరలు మరింత ఆశాజనకంగా ఉంటాయనే తెలుస్తోంది. మొత్తం మీద టమాట పంట.. పంటకు మధ్య వచ్చిన గ్యాప్ కారణంగా, ఇదే సమయంలో ఇతర రాష్ట్రాల్లో సీజన్ ముగియడంతో ధరలు పెరిగే అవకాశాలుంటాయని సమాచారం.

టమాట ధరలకు రెక్కలు

పుంగనూరు: నైరుతి రుతు పవనాల రాకతో కురిసిన వర్షాలకు టమాట పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ కారణంగా పంట దిగుబడి తగ్గి టమాట ధరలకు రెక్కలొచ్చాయి. స్థానిక మార్కెట్ కమిటీ నుంచి రోజూ చెన్నై, విజయవాడకు సుమారు 30 లారీల టమాలు రవాణా చేస్తారు. సోమవారం 10 కిలోల టమాట బాక్స్ ధర మొదటి రకం రూ.480 నుంచి రూ.567 లకు పలికింది. అలాగే రెండవ రకం రూ.340 పలికింది. 3,340 మెట్రిక్ టన్నుల టమాటాలు ఎగుమతి చేశారు. ఇదలా ఉంచితే, మండలంలో సుమారు 220 ఎకరాలలో టమాట సాగు చేశారు. వర్షాలకు సుమారు 150 ఎకరాలలో పంట దెబ్బతింది. మరోవైపు ధరలు ఒక్కసారిగా పెరగడంతో మిట్ట ప్రాంత రైతులు ఆనందం వ్యక్తం చేస్తుండగా లోతట్టు ప్రాంతాలలో పంట నష్టపోయిన రైతులు ఆవేదన చెందుతున్నారు.

టీటీడీ విభాగాలపై ఈఓ సమీక్ష



అన్నప్రసాదం నాణ్యత గురించి భక్తులను అడిగి తెలుసుకుంటున్న ఈఓ

తిరుమల: టీటీడీలోని అన్ని విభాగాధిపతులతో ఈఓ జె.శ్యామలరావు సోమవారం సమీక్షించారు. తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనంలో జేఈఓలు గౌతమి, వీరబ్రహ్మం, సీవీఎస్‌ఓ నరసింహ కిషోర్‌తో పాటు టీటీడీ ఉన్నతాధికారులతో ఈఓ సమీక్ష నిర్వహించారు. ఈఓ మాట్లాడుతూ శ్రీవారి దర్శనార్థం విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, సంతృప్తి చెందేలా సేవలందించాలన్నారు. దర్శనం, వసతి, నాణ్యమైన అన్నప్రసాదాలు, పారిశుద్ధ్యం, ఇతర సౌకర్యాలను అత్యున్నతంగా అందించడం మనందరి బాధ్యత అన్నారు. ఆదివారం తన తనిఖీలో పరిశీలించినప్పుడు, భక్తుల నుంచి అందిన అభిప్రాయాలు, వారి అంచనాలను చేరుకోవడానికి మనమందరం ఇంకా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి విభాగంలో చెక్ లిస్ట్, ఫీడ్ బ్యాక్ యంత్రాంగం ఏర్పాటు చేయడంతో పాటు, స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్లను (ఎస్‌ఓపీ) సిద్ధం చేయాలని ఆయన జేఈఓను ఆదేశించారు. దర్శనం, ఆన్‌లైన్ కోటా విడుదల, ఆలయానికి సంబంధించి సేవా టిక్కెట్లు, రిసెప్షన్ విభాగంలో వసతి విధానాలు, ఇంజినీరింగ్ పనులపై సంబంధిత అధికారులతో ఈఓ సుదీర్ఘంగా సమీక్షించారు.

ఈఓ తనిఖీలు

అంతకు ముందు టీటీడీ ఈఓ ముళ్లకుంట ప్రాంతంలోని వసతి గృహాలు, లడ్డూ కౌంటర్లను తనిఖీ చేసి భక్తుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎస్‌వీబీసీ సీఈఓ షణ్ముఖ్‌కుమార్, ఎఫ్‌ఏసీఏఓ బాలాజీ, డీఎల్‌ఓ వీరరాజు, సీఈ నాగేశ్వరరావు, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

నేడు 'ఫిర్యాదుల పరిష్కార వేదిక'

చిత్తూరు కార్పొరేషన్: కలెక్టరేట్‌లో మంగళవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామని, ప్రజలు తమ సమస్యలను ఫిర్యాదుల రూపంలో అధికారులకు దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని కోరారు.

నిలకడగా నిమ్మ ధరలు

సైదాపురం: గతేడాదితో పోల్చి చూస్తే ఈసారి నిమ్మ ధరలు నిలకడగా ఉన్నాయి. ఈ ఏడాది దిగుబడి కూడా ఆశించిన స్థాయిలోనే ఉన్నట్లు రైతులు చెప్పారు. ప్రస్తుతం కిలో నిమ్మ కాయలు రూ.40 నుంచి రూ.65 ధర పలుకుతున్నాయి. వేసవిలో ఎక్కువగా డిమాండ్ ఉన్నా ధరలు పెరగలేదని రైతులు చెప్పారు.

క్లుప్తంగా

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పేరిట యువతికి టోకరా

చిత్తూరు అర్బన్: సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తామని ఓ యువతి నుంచి రూ.2.90 లక్షలు తీసుకుని దగా చేశారు. బాధితురాలు ఫిర్యాదు చేయడంతో సోమవారం చిత్తూరు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ ఉలసయ్య కథనం.. సంతపేటకు చెందిన వైష్ణవి డిగ్రీ పూర్తి చేసి సాఫ్ట్‌వేర్ రంగంలోకి వెళ్లాలని ప్రయత్నాలు ప్రారంభించింది. బెంగళూరులోని మంచి కంపెనీల్లో ఉద్యోగం ఇప్పిస్తామని ఫోన్‌లో పరిచయమైన ముగ్గురు వ్యక్తులు ఈమె నుంచి పలు దఫాలుగా రూ.2.90 లక్షలు తీసుకున్నారు. ఉద్యోగం ఇప్పించకపోవడంతో పాటు, నగదును కూడా ఇవ్వకుండా మోసం చేశారు. తనను మోసం చేశారని గ్రహించిన బాధితురాలు.. మురకంబట్టుకు చెందిన నిందితులు భరత్‌కుమార్, శివాజీ, రాజేష్‌పై ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముక్కంటి ఆలయం కిటకిట

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయం సోమవారం భక్తులతో కిక్కిరిసింది. వారాంతపు, వరుస సెలవుల నేపథ్యంలో తిరుమల శ్రీవారి భక్తులతో పాటు తమిళనాడు, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి సుమారు 38 వేల మంది తరలివచ్చారు. రూ.200 శీఘ్ర దర్శనం ద్వారా 5,680 మంది, రూ.50 ప్రత్యేక దర్శనం ద్వారా 3,050 మంది దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహు–కేతుపూజలకు 3,631 మంది, రూ.750 పూజలకు 1,869, రూ.1,500 పూజలకు 597, రూ.2,500 పూజలకు 393, రూ.5 వేల పూజలకు 98 మంది భక్తులు పాల్గొన్నారు. ఐదు రకాల ప్రసాదాలు కలిపి 28,159 విక్రయించారు.

ఇంజినీరింగ్ అడ్మిషన్లకు యూనివర్సిటీలు సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే ఏపీ ఈఏపీసెట్ ఫలితాలను విడుదల చేసిన ఉన్నత విద్యామండలి ర్యాంకు కార్డులను సైతం విద్యార్థులకు అందించింది. ఈనెల చివరి వారంలో రిజిస్ట్రేషన్, వెబ్ ఆప్షన్లు ఇచ్చేందుకు సమాయత్తమవుతోంది. జూలై మొదటి వారం నుంచి కౌన్సెలింగ్ ప్రారంభించనున్నట్టు తెలుస్తోంది. ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌తోపాటు పద్మావతి మహిళా వర్సిటీలోని స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ అధికారులు కౌన్సెలింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈ రెండు యూనివర్సిటీలలో వంద శాతం కన్వీనర్ కోటాలోనే సీట్ల భర్తీ ప్రక్రియ ఉంటుంది.



ఇంజినీర్లుగా రాణిద్దాం రండి!

ఇంజినీరింగ్ అడ్మిషన్లకు రెడీ

- బ్రాంచ్ ఎంపిక, వెబ్ ఆప్షన్ల విషయంలో జాగ్రత్త
- జూలై మొదటి వారంలోనే కౌన్సెలింగ్
- ఎస్వీయూలో ఆరు బ్రాంచ్‌లు.. 396 సీట్లు
- మహిళా వర్సిటీలో నాలుగు బ్రాంచ్‌లు... 396 సీట్లు
- ఆ రెండు ఇంజినీరింగ్ కళాశాలల్లో 70 శాతం ప్లేస్‌మెంట్స్
- రాష్ట్రంలోనే ఏకైక ప్రభుత్వ మహిళా ఇంజినీరింగ్ కళాశాల

తిరుపతి సిటీ: ఇంజినీరింగ్‌లో ప్రవేశాలకు అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. ర్యాంక్ కార్డుల ఆధారంగా సీట్ల భర్తీ ప్రక్రియ చేపట్టనున్నారు. బీటెక్‌లో ప్రవేశాల కోసం ఉన్నత విద్యామండలి ఆన్‌లైన్ ద్వారా తమకు నచ్చిన బ్రాంచ్, కళాశాలను ఎంపిక చేసుకునే వెసులుబాటు ఇస్తుంది. ఈనెల చివరి వారంలో అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహణకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ముందుగా ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్లను పెట్టుకోవాల్సి ఉంటుంది. వెబ్ ఆప్షన్లు పెట్టుకునే సమయంలో విద్యార్థులు, తల్లిదండ్రులు అప్రమత్తతతో వ్యవహరించాలి. ప్రధానంగా బ్రాంచ్ ఎంపికలోనూ కచ్చితమైన నిర్ధారణకు రావాలి. ఫలానా బ్రాంచ్ తీసుకుంటే ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉన్నాయంటూ పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఒకే బ్రాంచ్‌ని ఎంపిక చేసుకుని తమకు నచ్చిన ఒకే కళాశాలను ఆప్షన్లలో ఉంచితే అంతే సంగతులు. తాము ఎంపిక చేసుకున్న బ్రాంచ్ కోసం 50 నుంచి 70 కళాశాలలను ఆప్షన్లలో ఉంచుకోవడం మంచిది. ఐదు వేల ర్యాంకు పైబడిన వారు మొదటి దశ కౌన్సెలింగ్‌లోనే 50కి మించి కళాశాలల్లో సీటు కోసం ఆప్షన్లు పెట్టాలి. లక్ష వరకు ర్యాంకు వచ్చిన విద్యార్థులు సైతం వెబ్ ఆప్షన్లలో అధిక సంఖ్యలో కళాశాలలను ఎంపిక చేసుకోవాలి. ఒక్క బ్రాంచ్‌పై ఆధార పడకుండా కనీసం రెండు లేదా అంతకంటే ఎక్కువ బ్రాంచ్‌లను ఎంచుకోవాలి.

అటానమస్ కళాశాలల్లో పెరగనున్న సీట్లు

ఏపీ ఈఏపీసెట్‌లో మంచి ర్యాంకు సాధించలేకపోయామనే ఆలోచన అవసరం లేదు. ఈ ఏడాది ఇంజినీరింగ్ కళాశాలల్లో సీట్ల పరిమితిపై ఉన్న సీలింగ్‌ను ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఎత్తివేసింది. దీంతో అటానమస్ కళాశాలలు అదనపు సెక్షన్లను ఏర్పాటు చేసుకునేందుకు అనుమతులు పొందాయి. అన్ని బ్రాంచ్‌లలో సీట్లు భారీగా పెరగనున్నాయి. ఏపీ ఈఏపీసెట్‌లో పెద్ద ర్యాంక్ వచ్చినా విద్యార్థులు ఏదో ఒక కళాశాలలో తమకు నచ్చిన బ్రాంచ్‌లో కన్వీనర్ కోటాలోనే ఫ్రీ సీటు సాధించవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

రాష్ట్రంలోనే ఏకైక మహిళా ఇంజినీరింగ్ కళాశాల

పద్మావతి మహిళా వర్సిటీలోని స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ మహిళలకు ప్రత్యేకంగా నెలకొల్పబడిన ఏకైక ప్రభుత్వ మహిళా ఇంజినీరింగ్ కాలేజీ. ఇందులో కంప్యూటర్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, మెకానికల్ ఇంజినీరింగ్ బ్రాంచ్‌లలో మాత్రమే అడ్మిషన్లు స్వీకరిస్తారు. ఇందులో సీఎస్ఈ, ఈసీఈలో 120 సీట్లు ఉండగా మరో 10 శాతం సీట్లు ఈడబ్ల్యూఎస్ కింద భర్తీ చేస్తారు. అదేవిధంగా ఈఈఈ, మెకానికల్ బ్రాంచ్‌లలో 60 సీట్లు మాత్రమే ఉండగా మరో 10 శాతం అంటే అదనంగా ఒక్కో బ్రాంచ్‌కు 6 సీట్లు ఈడబ్ల్యూఎస్ కింద భర్తీ చేస్తారు. అడ్మిషన్లలో వందశాతం కన్వీనర్ కోటాలోనే సీట్ల భర్తీ ఉంటుంది. కళాశాలలో పూర్తి స్థాయిలో అన్ని వసతులు ఉన్నాయి. ప్రతి ఏటా సుమారు 70శాతం వరకు ప్లేస్‌మెంట్ అవకాశం కల్పిస్తున్నారు. పేరొందిన ఎంఎన్‌సీ కంపెనీలు క్యాంపస్ డ్రైవ్‌లను క్రమం తప్పకుండా నిర్వహిస్తూ ఎంపికైన విద్యార్థినులకు మంచి ప్యాకేజ్‌తో ఉద్యోగాలు కల్పిస్తున్నాయి. కళాశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటాసైన్స్ వంటి మరో రెండు కొత్త కోర్సులను ప్రవేశపెట్టేందుకు అనుమతుల కోసం వేచిస్తున్నారు.



ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, తిరుపతి

మహిళా వర్సిటీ, ఎస్వీయూలో ఇంజినీరింగ్ సీట్ల వివరాలు

బ్రాంచ్	మహిళా వర్సిటీలో	ఎస్వీయూలో
సీఎస్ఈ	132	66
ఈసీఈ	132	66
ఈఈఈ	66	66
మెకానికల్	66	66
సివిల్	–	66
కెమికల్	–	66

కౌన్సెలింగ్‌కు కావాల్సిన ధ్రువపత్రాలు

- ఏపీ ఈఏపీసెట్–2024 ర్యాంకు కార్డు
- ఏపీ ఈఏపీసెట్–2024 హాల్ టికెట్
- ఇంటర్మీడియెట్ లేదా తత్సమాన పరీక్ష మార్కుల జాబితా
- పుట్టిన తేదీ ధ్రువపత్రం కోసం ఎస్ఎస్‌సీ మార్కుల జాబితా
- బదిలీ సర్టిఫికెట్ (టీసీ)
- స్టడీ సర్టిఫికెట్ 6వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు
- ఆర్థికంగా వెనుకబడిన వారు ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్–2025 వ్యాలిడిటీ (ఓసీ విద్యార్థులు)
- కుల ధ్రువీకరణ పత్రం(బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు)
- ఆదాయ ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు
- పాస్‌పోర్ట్ సైజ్ కలర్ ఫొటోలు

ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో...

ఎస్వీయూలోని ఇంజినీరింగ్ కళాశాలలో ఆరు బ్రాంచ్‌లకు కలిపి 396 సీట్లు వంద శాతం కన్వీనర్ కోటాలో భర్తీ చేయనున్నారు. సీఎస్ఈ, ఈసీఈ, ఈఈఈ, మెకానికల్, సివిల్, కెమికల్ ఇంజినీరింగ్‌లో ఒక్కో బ్రాంచ్‌లో 60సీట్ల చొప్పున భర్తీ చేస్తారు. దీంతో పాటు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల కింద మరో 10శాతం అంటే ఒక్కో బ్రాంచ్‌కి 6సీట్లు అదనంగా భర్తీ చేస్తారు. అదేవిధంగా లేటరల్ ఎంట్రీలో భాగంగా డిప్లొమో పూర్తిచేసి ఈసెట్ ద్వారా నేరుగా బీటెక్ సెకండ్ ఇయర్‌లో అడ్మిషన్లు పొందేందుకు అవకాశం ఉంది. లేటరల్ ఎంట్రీ అడ్మిషన్ల కోసం ప్రతి బ్రాంచ్‌లో ఆరు సీట్లు చొప్పున ఈసెట్ ర్యాంక్ ఆధారంగా అడ్మిషన్లు పొందవచ్చు. ఈ కళాశాలలో విద్యనభ్యసించిన సుమారు 70శాతం మందికి పేరొందిన ఎంఎన్‌సీ కంపెనీలలో ఉన్నత స్థాయి ఉద్యోగాలు పొందారు.

ఈ ఏడాది సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులలో అడ్మిషన్లు లేనట్టే!

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్‌తో పాటు సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులలో ఈ ఏడాది అడ్మిషన్లు చేయరాదనే నిర్ణయంతో ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది. గత ఏడాది ఈ కోర్సులలో అడ్మిషన్లు అంతంత మాత్రంగానే ఉండడంతో ఆ కోర్సులకు అడ్మిషన్లు పూర్తిగా నిలిపి వేయనున్నట్లు సమాచారం.

విద్యార్థి ఆసక్తిని బట్టి బ్రాంచ్ ఎంపిక



“ విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న బ్రాంచ్‌లను తీసుకోవడం మంచిది. ఎవరో చెప్పారనో బ్రాంచ్‌ని ఎంపిక చేసుకుని చేరిన తర్వాత పూర్తి స్థాయిలో చదువుపై దృష్టి పెట్టకపోతే లక్ష్యాన్ని సాధించలేరు. ఇంజినీరింగ్‌లో ప్రతి బ్రాంచ్‌కు మార్కెట్‌లో డిమాండ్ ఉంది. విద్యార్థి ఎంపిక చేసుకున్న బ్రాంచ్‌లో రాణిస్తూ స్కిల్ డెవలప్‌మెంట్, ఇన్నోవేటివ్ నాలెడ్జ్, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై దృష్టి సారించాలి. అప్పుడే తాను అనుకున్న లక్ష్యాన్ని చేరుకోగలరు. తల్లిదండ్రులు ఫలానా బ్రాంచ్‌లోనే బీటెక్ చేయాలని అంటూ విద్యార్థులపై ఒత్తిడి చేయరాదు. విద్యార్థి అభిరుచి ఆసక్తిని పరిగణలోని తీసుకోవాలి.

–ఎం.దామోదర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్, ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, తిరుపతి

మహిళపైకి దూసుకెళ్లిన కారు

- తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలు
- పరిస్థితి విషమం..తిరుపతి రుయాకు తరలింపు



హోటల్‌లోకి దూసుకెళ్లిన శాంత్రో కారు

పుంగనూరు: కారు ఢీకొని మహిళకు తీవ్రగాయాలైన సంఘటన సోమవారం ఉదయం పట్టణంలోని శుభారాం డిగ్రీ కళాశాల వద్ద చోటుచేసుకుంది. వివరాలు.. కళాశాలలో వాచ్ ఉమన్‌గా పనిచేస్తున్న పాపులమ్మ (55) కళాశాల వద్ద ఉన్న హోటల్‌లో కూర్చుని ఉండగా రహదారిపై మితిమీరిన వేగంతో వెళ్తున్న ఏపి 16 బిబి 5059 నంబరు గల శాంత్రో కారు అదుపు తప్పింది. హోటల్‌లోకి దూసుకుపోయి పాపులమ్మను ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. కారు డ్రైవర్ పరారయ్యాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాగునీటి మోటార్ వైర్ చోరీ



చోరీకు గురైన ప్రదేశం

శ్రీరంగరాజపురం: గ్రామ పంచాయతీలో ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన తాగునీటి మోటార్ వైర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు వరుసగా చోరీలు చేస్తున్నారు. గతంలో ములూరు, పిళ్లారికుప్పం, పద్మాపురం, పుల్లూరు, ముద్దుకుప్పం, 49 కొత్తపల్లి మిట్ట మోటార్ విద్యుత్ వైర్‌ను దొంగలు కట్ చేసుకుని వెళ్లిపోతున్నారు. పోలీసులకు గతంలో పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని స్థానిక సర్పంచులు, అధికారులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో నిఘా వైఫల్యంతోనే వరుసగా దొంగతనాలు జరుగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. సంబంధిత విషయంపై 49 కొత్తపల్లి మిట్ట సర్పంచ్ డీపీ డిల్లయ్య మాట్లాడుతూ గత వారం ముందు మోటర్ వైర్ చోరీ కావడంతో ఆదివారం అరవై వేలు వెచ్చించి కొత్త వైర్లు ఏర్పాటు చేశామన్నారు. అయితే ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేయడంతో స్థానిక పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశామని తెలిపారు.

వెండి ఉయ్యాల సమర్పణ



వెండి ఉయ్యాలను అందజేస్తున్న హేమంత్ కుటుంబ సభ్యులు

పుత్తూరు: అప్పలాయగుంటలోని శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామికి దాతలు వెండి ఉయ్యాలను సమర్పించారు. 4 కిలోల వెండితో తయారు చేసిన ఉయ్యాలను తిరుపతికి చెందిన హేమంత్ కుటుంబ సభ్యులు సోమవారం ఆలయ ప్రధాన అర్చకులకు అందజేశారు. ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని అందించిన ఉయ్యాలను ప్రతిరోజూ నిర్వహించే స్వామివారి ఏకాంత సేవలో వినియోగించాలని దాతలు కోరారు.

విత్తన చట్టం తెలుసా..?

- విత్తనాల దుకాణంలో లైసెన్సు ప్రదర్శించాలి
- కొనుగోలుదారునికి రశీదు తప్పనిసరి

బంగారుపాళెం: రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని రైతులను మోసగించే చర్యలకు కళ్లెం వేసేందుకు విత్తన చట్టం ఒకటి ఉందని పూర్తి స్థాయిలో రైతులకు తెలియదు. విత్తనాలు కొనుగోలు చేసే రైతుకు ఎలాంటి అన్యాయం జరిగినా ఈ చట్టం ద్వారా సంబంధిత విత్తనాల డీలర్లపై కఠిన చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంది. విత్తన చట్టం–1966, విత్తన నిబంధనలు–1968, విత్తన నియంత్రణ ఉత్తర్వులు–1983 మొదలైనవి విత్తనపరమైన అతిక్రమణలు, ఉల్లంఘనలకు చర్యలు తీసుకునేలా ఈ చట్టాలను రూపొందించారు. విత్తన విక్రయాల్లో ఉత్తర్వులు–1983 క్లాజు 3 అతిక్రమించినందుకు ఆయా దుకాణాల్లో విత్తనాలను జప్తు చేయడంతో పాటు అత్యవసర సరకుల చట్టం 1955 సెక్షన్–ఏ ప్రకారం జరిమానాకు గురవుతారు. వీటిలో కొన్ని చట్టాలను గమనిస్తే..

విత్తన లైసెన్సు ప్రదర్శన తప్పనిసరి

ప్రైవేట్ విత్తనాల విక్రయ దుకాణాల్లో తప్పనిసరిగా విత్తన లైసెన్సును ప్రదర్శించాలి. విత్తన లైసెన్సు లేకుంటే ఆయా దుకాణాల్లో విత్తనాల అమ్మకాలను నిలిపివేయవచ్చు. అంతేకాక నోటీసుకు సరైన సమాధానం ఇవ్వకపోతే విత్తన నియంత్రణ ఉత్తర్వులు–1983 క్లాజు 5 ప్రకారం డీలర్ లైసెన్సు సస్పెండ్, రద్దు చేయవచ్చు.

ధరల బోర్డు, స్టాకు బోర్డు ఏర్పాటు చేయాలి

విత్తనాలు విక్రయించే దుకాణాల్లో కచ్చితంగా ధరలు, స్టాక్ బోర్డులను ఏర్పాటు చేయాలి. అలా లేకుంటే విత్తన నియంత్రణ ఉత్తర్వులు–1983 క్లాజు 8 ప్రకారం ఆయా దుకాణాల్లో విత్తనాల అమ్మకాలు నిలుపుదల చేయవచ్చు. అంతే కాకుండా అధికారులు ఇచ్చిన నోటీసులకు సరైన సమాధానం ఇవ్వకపోతే లైసెన్సు సస్పెండ్, రద్దు చేయవచ్చు.



ప్రైవేటు విత్తనాల అమ్మకం దుకాణంలో మందులు, విత్తనాలు

విత్తనాల బస్తాలపై లేబుల్ లేకపోతే..

ప్రైవేట్ విత్తనాల అమ్మకందారుడి వద్ద కొనుగోలు చేసిన విత్తనాల బస్తాలకు లేబుల్ లేకపోతే విత్తన చట్టం 1966 సెక్షన్ 7 ప్రకారం చర్యలు తీసుకోవచ్చు. అంతేకాకుండా ఆయా విత్తనాలను జప్తు చేసే అధికారం ఉంది. అత్యవసర సరకుల చట్టం 1955 సెక్షన్ 7 ప్రకారం జరిమానా విధిస్తారు. కాలం చెల్లిన విత్తనాలు విక్రయిస్తే విత్తన చట్టం–1966 సెక్షన్ 7 ప్రకారం విత్తన నియంత్రణ ఉత్తర్వులు–1983 క్లాజు 8 ప్రకారం డీలర్ లైసెన్స్ సస్పెండ్, రద్దు చేయవచ్చు.



ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న వ్యవసాయాధికారులు (ఫైల్)

అమ్మకాల రసీదు ఇవ్వాల్సిందే

విత్తనాలు కొనుగోలు చేసే రైతులకు ఆయా దుకాణదారుడు కచ్చితంగా రశీదు ఇవ్వాలి. రశీదు ఇవ్వని పక్షంలో విత్తన నియంత్రణ ఉత్తర్వులు–1983 క్లాజు 9 ప్రకారం ఆయా దుకాణదారునికి ముందుగా నోటీసు జారీ చేసి దానికి సరైన సమాధానం ఇవ్వకపోతే ఆయా డీలర్ లైసెన్సును సస్పెండ్, రద్దు చేయవచ్చు.

నిబంధనలు పాటించాలి

“ ప్రభుత్వ విత్తన చట్టానికి లోబడి ప్రైవేట్ విత్తన డీలర్లు విత్తనాలను విక్రయించాలి. డీలర్లు నిబంధనలు అతిక్రమిస్తే భారీ జరిమానాతో పాటు దుకాణాల లైసెన్సును కోల్పోయే పరిస్థితి ఉంటుంది.

– చిట్టిబాబు, వ్యవసాయాధికారి, బంగారుపాళెం

కర్ణాటక మద్యం ధ్వంసం

పుంగనూరు: వివిధ నేరాలలో స్వాధీనం చేసుకున్న కర్ణాటక మద్యం బాటిళ్లను, ప్యాకెట్లను పోలీసులు సోమవారం ధ్వంసం చేశారు. 39 కేసుల్లో పట్టుబడ్డ 495 లీటర్ల మద్యం బాటిళ్లు, ప్యాకెట్లను గ్రామ పొలిమేరలకు తీసుకెళ్లి సెబ్ సూపరింటెండెంట్ శ్రీధర్ రావు, సీఐ రాఘవరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు రోడ్డు రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. సీఐ మాట్లాడుతూ, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్టు చెప్పారు. దాదాపు రూ.3 లక్షల పైచిలుకు విలువ చేసే మద్యాన్ని ధ్వంసం చేశామన్నారు. మద్యం అక్రమ రవాణ చేస్తే వదలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. ఎక్కడైనా అక్రమంగా మద్యం రవాణా చేస్తున్న పక్షంలో తమకు సమాచారం ఇవ్వాలని, వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.



రోడ్డు రోలర్‌తో ధ్వంసం చేస్తున్న మద్యం బాటిళ్లు

ఇవి కూడా వేలం వేస్తే ఆదాయమే కదా!?

రోడ్డు రోలర్‌తో కర్ణాటక మద్యం బాటిళ్లను తొక్కించడానికి దూరం నుంచి వీక్షించిన కొందరు మందుబాబులు నాలుక తడుపుకున్నారు. పోలీసులు, ఎక్సైజ్ అధికారులు అక్రమ మద్యం రవాణా కేసుల్లో స్వాధీనం చేసుకున్న మోటార్ సైకిళ్లు, వాహనాలను వేలం వేసి ఆ ఆదాయాన్ని ప్రభుత్వానికి జమ చేస్తారు సరే! మరి అక్రమ మద్యాన్ని కూడా వేలం వేస్తే ప్రభుత్వానికి ఆదాయమే కదా.. ధ్వంసం చేయడం ఎందుకంటూ..మందుబాబులు ధర్మ సందేహం లేవనెత్తారు. ఏదో అయిన కాడికి తమకు, ప్రభుత్వానికి కూడా గిట్టుబాటు అవుతుందంటూ వ్యాఖ్యానించారు. ఈ ఆలోచనలు మాకే వస్తాయి? అధికారులకు ఎందుకు రాదో అని నిట్టూరుస్తూ రోడ్డు రోలర్ కింద బాటిళ్లు పగిలి నేలలో ఇంకిపోతున్న మద్యం కేసి ఆశగా చూశారు!

● ‘బాతు’ మామిడి!



ఇదిగో ఇక్కడ చిత్రం కనిపిస్తున్న మామిడికాయను చూస్తుంటే ఏమనిపిస్తోంది? బాతును పోలినట్టు భలే ఉందే అనుకుంటున్నారు కదూ! అవును మరి.. మామిడి కాయల సీజన్‌లో ఇలా అడపాదడపా వివిధ ఆకృతుల్లో కాస్తూ ఆకర్షిస్తుంటాయి. ఇదే కోవలో మండలంలోని ఓ రైతు తోటలో మామిడి చెట్టుకు బాతు ఆకారంలో కాయ కాయడంతో అందరూ ఆసక్తిగా చూశారు.

– తవణంపల్లె